క్లుప్తంగా

పీఎఫ్ గరిష్ట పరిమితి పెంచాలి



జెడ్పీసీఈఓ సుబ్బారావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ పాక్షిక ఉపసంహరణ, మంజూరులో గరిష్ట పరిమితి పెంచాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ కోడూరి శ్రీనివాసరావులు బుధవారం జెడ్పీ సీఈఓ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ కింద దరఖాస్తు చేస్తే ప్రస్తుతం స్థలం కొనుగోలుకు రూ.2 లక్షలు ఇస్తున్నారని, దీన్ని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ఇంటి మరమ్మతులకు ఇచ్చే రూ.4 లక్షలను రూ.8 లక్షలకు చేయాలని పేర్కొన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఉన్న పీఎఫ్ మొత్తంలో ఇచ్చే 50 శాతాన్ని 70 శాతానికి పెంచాలని కోరారు. కుమార్తె వివాహానికి ఇచ్చే 6 బేసిక్స్‌ను 10 బేసిక్స్‌కు పెంచాలని, కుమారుడి వివాహానికి ఇచ్చే 3 బేసిక్స్‌ను 10 బేసిక్స్‌కు పెంచాలని పేర్కొన్నారు. పీఎఫ్ గరిష్టపరిమితి నిర్ణయించడానికి తగిన నిర్ణయాలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో రాష్ట్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో బుధవారం ఆయన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అన్నిపంటల రైతులందరూ రాష్ట్రసదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మూడురోజుల పాటు రైతు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర రైతు సదస్సులో తీర్మానాలు చేయనున్నట్టు చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్‌పై మొలిచిన మొక్కలు



ఫుట్‌పాత్, రోడ్డు కలిసిపోయిన దృశ్యం



ఫైర్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి

● ఫ్లైఓవర్ పర్యవేక్షణపై నిర్లక్ష్యం

ఏలూరు నగరానికి అతి ముఖ్యమైన ఫైర్‌స్టేషన్ ఫ్లైఓవర్ పర్యవేక్షణ కరువైంది. ఫ్లైఓవర్ ఇరువైపులా రక్షణగోడలు పడిపోయి, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌లు కుంగిపోయాయి. దీంతో నిత్యం ఫ్లైఓవర్‌పై వేలాది వాహనాలు, జనాలు భయంభయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అర్ధశతాబ్దం కితం నిర్మించిన ఈ ఫ్లైఓవర్ కనీసం మరమ్మతులు చేయడంలేదు. ఫ్లైఓవర్ ఇరువైపులా బలహీనంగా ఉన్న గోడలకే పబ్లిసిటీ బోర్డులు, ఇష్టానుసారం వివిధ రకరకాల వైర్లు కట్టి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫ్లైఓవర్ రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఫ్లైఓవర్ పడమర వైపు విరిగిపోయిన రెయిల్లింగ్



ఆదమరిస్తే పాతాళానికే..



పాడైపోయిన రక్షణ గోడ



ఫుట్‌పాత్‌పై ఇలా..

మహిళల భద్రత, రక్షణకు చర్యలు తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు(టూటౌన్): మహిళా ఉద్యోగులకు పనిచేస్తున్న కార్యాలయంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి వారికి కనీస వసతులను ఏర్పాటు చేయాలని, మహిళ వ్యక్తిగత భద్రత, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరులోని న్యాయస్థానాల్లో పనిచేస్తోన్న మహిళా ఉద్యోగులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో తోటి ఉద్యోగుల వల్ల సమస్యలు ఎదుర్కొనడానికి ప్రతి కార్యాలయంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యుల పేర్లను కార్యాలయంలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఎవరికైనా సమస్యలు ఎదురైనా ఉద్యోగులు ధైర్యంగా కమిటీ ముందు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. మహిళా ఉద్యోగులు తమ సమస్యలను కమిటీ ముందుగాని, సంబంధిత కలెక్టర్ వద్దనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబూ తాలిబ్ పర్వీజ్ షేక్, సీనియర్ న్యాయవాది నానా కృష్ణారావు, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు కేఎస్ నాగలక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏడీ రామ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి కార్యక్రమంల స్థానిక దొండపాడు పరివర్తన్ బధిరుల పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ పాల్గొన్నారు. దీనదయాళ్ చిత్రపటానికి ఏడీ రామ్‌కుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు. దీన్ దయాళ్ ఉపాధ్యా జాతీయ దివ్యాంగుల పునరావాస సంస్థను స్థాపించి ఎంతో మంది దివ్యాంగులకు సేవలు అందించారని, దీంతో దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ పేరుమీద స్కీమ్‌ను ఏర్పాటు చేసిందని ఏడీ గుర్తు చేశారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో డీడీఆర్‌సీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో..

స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజంలో చిట్ట చివరి వ్యక్తి వరకు కూడా ప్రభుత్వ ఫలాలు అందాలని, దృఢమైన అభివృద్ధి చెందిన భారత దేశాన్ని అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని ఏకాత్మతా మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రవచించిన గొప్ప రాజనీతిజ్ఞుడు, మానవతావాది, గొప్పతత్వవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నడపన దాన భాస్కరరావు, గాది రాంబాబు, గుమ్మడి కృష్ణ చైతన్య, నాగం శివ, గొంతిన సర్వేశ్వరరావు, ముద్దాని దుర్గారావు, వీరవల్లి శ్రీనివాస్, ఇలపకుర్తి కుసుమ, చేకూరి గణపతి, అడపాక సురేష్, ముద్దాని జ్యోతి కుమార్, పామర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలంగా ఉంటే సమస్యల పరిష్కారం తేలిక

ఏలూరు (టూటౌన్): సంఘం బలంగా ఉంటే సమస్యల పరిష్కరించుకోవడం తేలికవుతుందని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సమస్యలు తీర్చడానికి తాను ఎప్పుడూ ముందుంటానని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ది ఏలూరు అవుట్‌డోర్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక పవరుపేటలోని ఐఎంఏ హాలులో నిర్వహించారు. పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘ సభ్యులందరూ ఐక్యమత్యంతో ఉండాలని సూచించారు. అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించిన తానంకి ఉమ ఐదేళ్ల కుమార్తెకు అసోసియేషన్ రూ.45 వేలు సాయం చేయగా, పెదబాబు మరో రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కె.వెంకట్, కోశాధికారి బి.అప్పారావు, అసోసియేషన్ సభ్యులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జీతాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని ఫిర్యాదు



కమిషనర్ భానుప్రతాప్‌కు సమస్యను విన్నవిస్తున్న ప్రమోషన్ పొందిన డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): తాము డ్రైవర్లుగా ప్రమోషన్ పొంది, రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా తమకు పెరిగిన జీతాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదంటూ నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు 9 మంది డ్రైవర్లు బుధవారం తమ గోడు విన్నవించారు. నగరపాలక సంస్థలోని పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌గా పనిచేస్తున్న 8 మంది, ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఒకరిని డ్రైవర్స్‌గా ప్రమోషన్ కల్పించారని పేర్కొన్నారు. అయితే ప్రమోషన్ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, తమకు అదనపు లబ్ధి కలగలేదదని తెలిపారు. దీనిపై కమిషనర్ నగరపాలక సంస్థలోని ఎఫ్–1 సెక్షన్ గుమాస్తాను పిలిచి తక్షణమే ఇంక్రిమెంట్లు, పెరిగిన వేతనాలు చెల్లించాలని ఆదేశించినట్టు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. జనవరిలో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి రూ.వెయ్యి బోనస్ ప్రకటించారని పేర్కొన్నారు. ఈ బోనస్‌ను కార్పొరేషన్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ సిబ్బందికి చెల్లించారని, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వారికి చెల్లించలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ కార్యకర్తలు డి.అప్పారావు, ఎ.శేఖర్, పి.ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, జి.అప్పారావు, ఏబీ ఆంథోనీపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని, భారీ జరిమానాలు విధిస్తామని ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఏలూరు నగరంలోని పాతబస్టాండ్, అజంతా సెంటర్‌లో ఆయన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నగరంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ఇష్టారాజ్యంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడితే ఆయా కుటుంబాలు నష్టపోతాయనే విషయాలను గుర్తించాలని సూచించారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై అమరేశ్వరరావు, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

దోమల లార్వాలను నిర్మూలించాలి



కబడ్డీగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు (టూటౌన్): దోమ లార్వాలను నిర్మూలించడం ద్వారా దోమల వృద్ధిని కొంత వరకు అరికట్టవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక తంగెళ్లమూడి, కబడ్డీగూడెం ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను నిర్మూలించడం కంటే దోమ పిల్లలైన లార్వాలను నిర్మూలించడం తేలికని అన్నారు. దోమకాటు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా మొదలైన జ్వరాలు సంక్రమిస్తాయని, దోమ కాటు నుంచి సంరక్షించుకోవాలని సూచించారు. సాయంత్రం వేళల్లో కిటికీలు మూయడం, దోమల తెరలు వాడటం ద్వారా దోమ కాటు నుంచి రక్షించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రహమున్నీసా బేగం, నాంచారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, శానిటేషన్ సెక్రటరీ కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు ఉమ, కమల, దుర్గ పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ

ఏలూరు టౌన్ : ఏలూరు ఆదివారపుపేటలోని రజకుల కాలనీలో దుండగులు ఒక ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ చేశారు. రజకుల కాలనీకి చెందిన గోవాడ సురేష్ బుధవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి తన తండ్రి భద్రయ్యను ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.1 లక్ష నగదు అపహరించినట్టు గుర్తించారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు చేయగా సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరి అరెస్టు

త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ కోటేశ్వరరావు గస్తీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆకివీడుకు చెందిన నక్కా మహేష్, రాజమహేంద్రవరంలోని గోకవరం ప్రాంతానికి చెందిన బండి రాజు అలియాస్ పండులను తనిఖీ చేయగా వారి వద్ద 2 కేజీల 160 గ్రాముల గంజాయి కలిగి ఉండటంతో వారిని అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ గతంలో కూడా గంజాయిని ఏలూరు నగరంలో విక్రయించినట్టు కేసులు ఉన్నాయని నిర్ధారించారు. నిందితులను విచారించగా విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి ఏలూరు నగరంలో విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	60-100
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	50-56	ములక్కాడలు	07,10
బెండకాయలు	28	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	54-60	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70-140
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	44-54	పాలకూర	13
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30-40	బఠాణి	--
ఆనపకాయ (1)	30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	58

రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి

దెందులూరు: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అహంకారంతో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం క్షమించరాని విషయమని చట్ట సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆయన్ని అరెస్టు చేయాలని మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్, గిరిజన, బహుజన, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఉద్యమిస్తాయని వేదిక రాష్ట్ర నాయకులు మద్దా భూషణం, కొత్తపల్లి గోపిరాజు అన్నారు. బుధవారం రామారావుగూడెం బస్టాండ్ సెంటరులో రఘురామకృష్ణరాజుకు వ్యతిరేకంగా మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

జీవితంలో కమ్యూనికేషన్ పాత్ర కీలకం



సర్ సీఆర్‌రెడ్డి అటానమస్ కాలేజీ ఆడియో విజువల్ హాలులో పాల్గొన్న అధ్యాపకులు

ఏలూరు (టూటౌన్) : వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో కమ్యూనికేషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని రిటైర్డ్ లెక్చరర్ బొడ్డపాటి చంద్రశేఖర్ అన్నారు. సర్ సీఆర్‌రెడ్డి అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాలులో ఇంగ్లిష్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ద రోల్ ఆఫ్ కమ్యూనికేషన్ ఇన్ అవర్ లైఫ్ అండ్ ప్రొఫెషన్ అనే అంశంపై అతిథి ఉపన్యాసాన్ని బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో 30 ఏళ్లకుపైగా అనుభవం ఉన్న రిటైర్డ్ లెక్చరర్ బొడ్డపాటి చంద్రశేఖర్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని మాట్లాడారు. కమ్యూనికేషన్ అనేది సరళభాష, భావవ్యక్తీకరణకు బాగా దోహదం చేస్తుందని వివరించారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ కమ్యూనికేషన్ కేవలం మాట్లాడటమే కాకుండా విస్తృతమైన అర్థం కలిగి ఉందని తెలిపారు. కరస్పాండెంట్ కేఎస్ విష్ణు మోహన్, వైస్ ప్రిన్సిపాల్ కే.విశ్వేశ్వరరావు, ఆంగ్ల విభాగాధిపతి లక్ష్మి సరస్వతి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కేఎస్ చంద్రశేఖర్, శ్రీదేవి, సూర్యకుమారి, గౌతమిమిశ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మించాలని సీపీఎం విద్యార్థి శాఖ డిమాండ్ చేసింది. సీపీఎం శాఖ మహాసభల ప్రక్రియలో భాగంగా ఏలూరులో ఆపార్టీ విద్యార్థి శాఖా మహాసభ బుధవారం దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కె.లెనిన్ పాల్గొని మాట్లాడారు. రాజేశ్వరి, దుర్గ, రాజా తదితరులు పాల్గొన్నారు.

షేర్ ధనం మినహాయించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): షేర్ ధనం మినహాయించి వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న సహకార సంఘాల మూడు యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. జిల్లా సహకార కేంద్రబ్యాంకు మహాజన సభ బుధవారం నిర్వహించారు. సభకు విచ్చేసిన ధాత్రీరెడ్డికి యూనియన్ నాయకులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సంఘం ద్వారా రైతులకు ఐదు శాతం షేర్‌ధనంతో ఎంపీసీసీ, రైతునేస్తం అప్పులు ఇచ్చారని పేర్కొన్నారు. రైతు అప్పు తిరిగి చెల్లించేటప్పుడు సంఘం రైతు నుంచి వసూలు చేసిన 5 శాతం షేర్‌ధనం మినహాయించి వసూలు చేస్తున్నట్టు తెలిపారు. బ్యాంకు వారు తమ వద్ద వసూలు చేసిన షేర్‌ధనం మినహాయించకుండా మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. దీంతో పలు సహకార సంఘాలు నష్టాల బాట పడుతున్నాయని తెలిపారు. వీటితో పాటు యూనియన్‌లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. జేసీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు పి.విజయ్, కోశాధికారి పెద్దిరాజు, రేలంగి శ్రీను, యూనియన్ మాజీ జిల్లా అధ్యక్షులు నందమూరి సుబ్బారావు పాల్గొన్నారు.